‘నిత్య జనగణమన’కు 365 రోజులు

- ప్రజల్లో పెరుగుతున్న దేశభక్తి భావం
- ఉత్సాహంగా పాల్గొంటున్న ప్రజలు


పెగడపల్లిలో నిత్య జనగణమనకు హాజరైన ప్రజలు

పెగడపల్లి: మండల కేంద్రంలో నిత్య జనగణమన ఏర్పాటై నేటికి 365 రోజులకు చేరుకుంది. ప్రతి నిత్యం క్రమం తప్పకుండా ఉదయం 9గంటల వరకు జాతీయ గీతాన్ని ఆలపిస్తున్నారు. మండల కేంద్రం బస్టాండ్ సమీపంలోని ప్రధాన రహదారిపై ఉన్న అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిత్య జనగణమన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీంతో ప్రజలు ఏడాదికి రెండుసార్లు పాడే జాతీయ గీతాన్ని ప్రతినిత్యం ఉదయం 9గంటలకు ఆలపించే అవకాశం కలిగింది. ఎక్కడి వారు అక్కడే నిలబడి ప్రతిరోజూ జాతీయ గీతాలాపన చేస్తున్నారు. శ్రీరాజరాజేశ్వర ఆలయం కమిటీ ఆధ్వర్యంలో దాతల సాయంతో నిత్య జనగణమన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

ఏప్రిల్ 10న ప్రారంభం..

పెగడపల్లి మండల కేంద్రంలో గతేడాది ఏప్రిల్ 10న నిత్య జనగణమన కార్యక్రమం ప్రారంభమైంది. స్థానిక శ్రీరాజరాజేశ్వర ఆలయం, యువజన సంఘాలు, ఆలయ అర్చకుడు వినయ్‌శర్మ, చైర్మన్ గంగారెడ్డి ఆధ్వర్యంలో విరాళాలు సేకరించి స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఈ కార్యక్రమం ప్రారంభించారు. ప్రతిరోజు ఉదయం 9 గంటలకు జాతీయ గీతాలాపనలో ప్రజలు పాల్గొంటున్నారు. జాతీయ గీతం ప్రారంభించే సమయానికి దుకాణదారులు, వాహనదారులు, విద్యార్థులు, రహదారిపై వెళ్తున్న ప్రయాణికులు ఎక్కడివారక్కడే నిలబడి జాతీయ గీతాన్ని ఆలపిస్తున్నారు. ఇంతకాలంగా ఏడాదికి జనవరి 26, ఆగస్టు 15న ఏడాదికి రెండుసార్లు మాత్రమే జాతీయ గీతాలాపన చేసే ప్రజలు నిత్య జనగణమనతో ప్రతిరోజూ గీతాలాపన చేసే అవకాశం లభించడంతో ప్రజలు భక్తిభావంతో పాల్గొంటున్నారు.

నిర్వాహకులకు అభినందనలు



పెగడపల్లిలో ఏర్పాటు చేసిన నిత్య జనగణమన ప్రజలకు ఎంతో స్ఫూర్తిదాయకం. నిత్య జనగణమన ద్వారా జాతీయ స్ఫూర్తిని విస్తరింపజేస్తున్న నిర్వాహకులకు అభినందనలు. సర్పంచ్‌గా కాకుండా సామాన్యుడిగా నేను కూడా ఏడాదిగా ప్రతినిత్యం కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉంది.
– మేరుగు శ్రీనివాస్, సర్పంచ్

ప్రతిరోజూ క్రమం తప్పకుండా..



ఏడాదిగా క్రమం తప్పకుండా నిత్య జనగణమన కార్యక్రమంలో పాల్గొంటున్న. ఉదయం పూట జాతీయ గీతాలాపన చేయడంతో నాలో మంచి అనుభూతి కలుగుతుంది. ఉదయం ఎన్ని పనులున్నా నిత్య జనగణమన కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉంది.
– పార్థసారథి, చికెన్ సెంటర్ నిర్వాహకుడు

దేశభక్తి పెరిగింది



పెగడపల్లిలో నిత్య జనగణమన కార్యక్రమం ఏర్పాటు చేసి జాతీయ గీతం పాడుతుండటంతో ప్రజల్లో దేశభక్తి పెరిగింది. కార్యక్రమం ఏర్పాటు చేసినప్పటి నుంచి క్రమం తప్పకుండా హాజరవుతున్న. పెగడపల్లిలో నిత్య జనగణమన ఏర్పాటు చేసి ప్రజల్లో దేశభక్తిభావం పెంపొందించేందుకు కృషిచేసిన వారికి ప్రత్యేక కృతజతలు.
– మాధారపు కిషన్‌రావు, స్థానికుడు

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్, జెడ్పీచైర్‌పర్సన్ వసంత

జగిత్యాలరూరల్: సీఎం కేసీఆర్ కుటుంబం రాష్ట్రంలోని నాలుగు కోట్ల మంది ప్రజల కుటుంబమని, రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం జగిత్యాలరూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో మీరు–నేను కార్యక్రమంలో పల్లె నిద్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా 44 లక్షల మందికి రైతుబీమా, 12లక్షల మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, 20లక్షల మంది విద్యార్థులకు సన్నబియ్యం అందించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నర్సరీ ఏర్పాటు చేసి మొక్కలు నాటడం ద్వారా గ్రామాలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయని అన్నారు. అనంతరం లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎంపీపీ పాలెపు రాజేంద్రప్రసాద్, సర్పంచ్ చెరుకు జాన్, ఎంపీటీసీ సునీత, ఆత్మ చైర్మన్ రాజిరెడ్డి, నాయకులు ఎడమల సత్యం, చంద్రయ్య, గంగయ్య, జనార్దన్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ..

జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో రూ.10లక్షలతో నిర్మించే సీసీరోడ్డు, రూ.1.50 లక్షలతో నిర్మించే ఆలయానికి ఆదివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేరుగు రమ్యలు పాల్గొన్నారు.

నరేందర్ సేవలు చిరస్మరణీయం

జగిత్యాలటౌన్: బండారి నరేందర్ సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే డా.సంజయ్‌కుమార్ అన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన మాజీ కౌన్సిలర్, బీఆర్‌ఎస్ పార్టీ రైతు విభాగం పట్టణ అధ్యక్షుడు నరేందర్ సంస్మరణ సభ ఆదివారం పట్టణంలోని ఎస్‌వీఎల్‌ఆర్ గార్డెన్స్‌లో జరిగింది. మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, జిల్లా వైద్యాధికారి పుప్పాల శ్రీధర్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జీఆర్ దేశాయ్, హరిఅశోక్‌కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు గట్టు సతీశ్, కౌన్సిలర్ కూసరి అనిల్, నాయకులు సమ్మిండ్ల శ్రీనివాస్, కచ్చు లత, పుప్పాల గంగాధర్ పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ సండే వేడుకలు


ఇబ్రహీంపట్నం: ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

పెగడపల్లి: మండలంలో ఆదివారం క్రైస్తవుల ఈస్టర్ సండే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న చర్చిల్లో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు.

ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో..

ఇబ్రహీంపట్నం మండలకేంద్రంతో పాటు మండంలోని డబ్బా, వర్షకొండ, వేములకుర్తి, యామాపూర్, తిమ్మాపూర్ తండా, గోధూర్ గ్రామంలో ఆదివారం ఈస్టర్ సిలువ పండుగ వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. డబ్బా గ్రామంలో తెల్లవారుజామున ఈస్టర్ గుడ్డును ఎంపీటీసీ శాంత, జీవన్ స్వంతం చేసుకున్నారు. వేడుకల్లో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, జెడ్పీటిసి భారతిలు పాల్గొని క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు లింగంపెల్లి గంగాధర్, చర్చిల పాస్టర్లు బాబురావు, బలిపీఠం, భీమరెడ్డి, గిద్యోను, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు

మెట్‌పల్లి: పట్టణంలో ఈస్టర్ పండుగ వేడుకలను ఆదివారం క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక జీసస్ లైట్స్ చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ ఏలియా, పాస్టర్ ఇనిడ్ మెంగు, ఏబెల్, శ్యామ్‌సుందర్, రాజశేఖర్, సుభాష్, సురేశ్ ఉన్నారు.

అంబేడ్కర్ జయంతి ఉత్సవాలకు తరలిరావాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

సారంగాపూర్: 14న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న అంబేడ్కర్ జయంతి ఉత్సవాలకు ప్రజలు భారీగా తరలిరావాలని ఉత్సవ నిర్వహణ జిల్లా కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామం అంబేడ్కర్ విగ్రహం వద్ద జయంతి ఉత్సవాల పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. కమిటీ సభ్యులు దుమాల గంగారాం, బెజ్జంకి సతీశ్, శ్రీను, జగన్ పాల్గొన్నారు.

కనీస వేతనాలు ఇవ్వండి

మేడిపెల్లి: తమ సమస్యలు పరిష్కారించాలంటూ ఆదివారం మండల కేంద్రంలో పర్యటించిన మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ వీవోఏ వినతిపత్రం అందించారు. ప్రస్తుతం ఉన్న గౌరవ వేతనాన్ని రూ.15వేలకు పెంచాలని, పాటు తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

✦ముస్లింలకు బట్టలు పంపిణీ

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ గ్రామంలో రంజాన్ పండుగను పురస్కరించుకొని ఆదివారం ప్రభుత్వం అందచేసిన 50 మంది ముస్లింలకు బట్టలు పంపిణీ చేశారు. ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పొనకంటి వెంకటి, ఉపసర్పంచ్ లక్ష్మణ్, మైనార్టీ సంఘం ఉపాధ్యక్షుడు నాసర్, నాయకులు పాల్గొన్నారు.

✦అనాథ వృద్ధాశ్రమానికి రూ.10వేల విరాళం

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని శివ గాయత్రి అనాథ వృద్ధాశ్రమానికి రూ.10వేల విరాళాన్ని దాతలు ఆదివారం ఆశ్రమ నిర్వాహకుడు సూరజ్ శివశంకర్‌కు అందజేశారు. మేడిపల్లి మండల కేంద్రానికి చెందిన లింగాల మల్లేశ్–శ్వేత దంపతుల కూతురు మహణ్య జన్మదినం సందర్భంగా రూ.5వేలు, జిల్లా కేంద్రంలోని మెకానిక్ ఇంజనీరింగ్ షాపులకు చెందిన అంజన్న భక్తులు హనుమాన్ జయంతి సందర్భంగా శంకర్, కృష్ణ, ఆంజనేయులు, హన్మంతు, సత్యనారాయణ, శ్రీహరి, రాజేశం రూ.5వేలు అందజేశారు. సునీత, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

✦సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

కథలాపూర్: మండలంలోని 14 గ్రామాల్లో సీసీరోడ్లకు గాను ఎంపీ కోటా రూ.66లక్షల నిధులు మంజూరైనట్లు బీజేపీ నాయకులు కొడిపెల్లి గోపాల్ రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, అజయ్‌రావు ఆదివారం తెలిపారు. కథలాపూర్, తక్కళ్లపెల్లి, భూషణరావుపేట, దూలూర్, దుంపేట, చింతకుంట, తాండ్ర్యాల, అంబారిపేట, పోసానిపేట, సిరికొండ గ్రామాలకు రూ.5లక్షల చొప్పున కేటాయించారు. ఇప్పపెల్లి, పోతారం, పెగ్గెర్ల, తుర్తి గ్రామాలకు రూ.4లక్షల చొప్పున కేటాయించారు.

✦ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని తాళ్లధర్మారం, మంగేళ, కొల్వాయి గ్రామాల్లో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి టీడీపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి మహంకాళి రాజన్న, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి భార్గవరాం వివరించారు. అడ్వకేట్ సంద్రుగల విజయ్‌కుమార్, బత్తుల కొండయ్య, నక్క లక్ష్మణ్, సురివి సంతోష్‌రావు, ప్రభాకర్ తదతరులు ఉన్నారు.

ముళ్లపొదలు దారిని కమ్మేస్తున్నాయి


చెరువు కట్ట దారిపై విస్తరించిన ముళ్ల పొదలు

మల్యాల: మండల కేంద్రంలోని సూరప్ప చెరువు కట్టపై ముళ్లపొదలు దారిని కమ్మేస్తున్నాయి. సూరప్ప చెరువు కట్టపై ఇరువైపులా సర్కారి తుమ్మ చెట్ల కొమ్మలు ఏపుగా పెరగడంతోపాటు కట్టపొడవునా దారిపైకి విస్తరించాయి. కట్టపై నుంచి వెళ్లే వాహనదారులు, గీతకార్మికుల కళ్లలో గుచ్చుకుంటున్నాయి. అధికారులు స్పందించి, కనీసం ఉపాధిహామీ పథకం కిందనైనా పనులు చేపట్టి, ముళ్లపొదలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

రైతులు కెపాసిటర్లు బిగించుకోవాలి


మాట్లాడుతున్న ఏఈ సతీశ్

ఇబ్రహీంపట్నం: రైతులు తమ వ్యవసాయ పంపుసెట్లకు కెపాసిటర్లను బిగించుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ సతీశ్ కోరారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని కేశాపూర్ గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌ల కమిటీ సభ్యులు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఆటోమేటిక్ స్టార్టర్లను తొలగించాలని కెపాసిటర్లు బిగించుకుంటే రైతులకు విద్యుత్ ఆదాతో పాటు కరెంటు మోటార్లు కాలిపోకుండా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ రాజేశ్‌నాయక్, సర్పంచ్ దాసరి పోశెట్టి, సిబ్బంది సాంబమూర్తి, రాము, రాంబాబు పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ బహూకరణ

మల్యాల: మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాలకు ఎల్‌జీ టీవీ బహూకరించారు. ఈ మేరకు ఆదివారం తాటిపల్లి బాలికల పాఠశాలలో 1987–88లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి ఆదివారం పాఠశాలను సందర్శించారు. పాఠశాలకు టీవీ బహూకరించారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌కు సన్మానం


సౌజన్యను సన్మానిస్తున్న గ్రామస్తులు

కథలాపూర్: మండలంలోని దూలూర్ గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుండారపు సౌజన్యను ఆదివారం గ్రామస్తులు సన్మానించారు. గ్రామానికి చెందిన సౌజన్య ఏఎంసీ చైర్‌పర్సన్‌గా నియమితులు కావడం గర్వకారణమని స్థానికులు పేర్కొన్నారు. అదే గ్రామానికి చెందిన డైరెక్టర్ మేడిపెల్లి రాజారెడ్డిని సన్మానించారు. సర్పంచ్ దయ్య లక్ష్మీనర్సయ్య, ఉపసర్పంచ్ గోపిడి కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు జూపాక మహేశ్, పడాల భూమేశ్ పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం


సాయం అందిస్తున్న ప్రజాప్రతినిధులు

మల్లాపూర్: మండలంలోని వేంపల్లిలో ఆదివారం అనారోగ్యంతో ఆరెల్లి నర్సవ్వ అనే వృద్ధురాలు మృతి చెందింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ బిట్ల సరోజన, ఎంపీటీసీ గుగ్లావత్ భూమి, ఉపసర్పంచ్ వెల్మల రాజనర్సయ్య, పంచాయతీ కార్యదర్శి నరేశ్ బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. గ్రామ పంచాయతీ నిధుల్లోంచి దహన సంస్కారాలకు రూ.10వేలు అందజేశారు. వార్డుసభ్యులు పడాల మానస, నాయకులు బిట్ల నరేశ్, గుగ్లావత్ రాజేందర్ పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న జాతర


బోనాలతో భక్తులు

కోరుట్లరూరల్: కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామ శివారులో గల మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మల్లన్నకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం యెఖీన్‌పూర్‌తో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు బోనాలను ఊరేంపుగా తీసుకెళ్లి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. రైతులు ఎడ్లబండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య–అనిల్, కౌన్సిలర్లు బద్ది సుజాత–మురళి, సత్యం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

నియామకం

గొల్లపల్లి: మహాత్మాజ్యోతిబాపూలే జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్‌గా బీసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా గొల్లపల్లికి చెందిన బీసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల మహిపాల్ నియమితులయ్యారు.

అటెన్షన్ ప్లీజ్



ప్రమాదకరంగా డ్రైనేజీ

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో ప్రధానరోడ్డు పక్కన డ్రైనేజీ లోతుగా ఉండటంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డు ఎత్తుగా ఉండటం.. డ్రైనేజీ లోతుగా ఉండటంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్లు భవనాల శాఖ అధికారులు చొరవ చూపి రోడ్డుకు సమాన ఎత్తులో డ్రైనేజీ నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారి పేరు : వెంకటరమణ, ఆర్‌అండ్‌బీ డీఈ, మెట్‌పల్లి
ఫోన్ నంబర్: 94408 18426

కొమొరెడ్డి రామ్‌లుకు మంత్రి ఈశ్వర్ నివాళి


నివాళి అర్పిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

మెట్‌పల్లి: మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రామ్‌లుకు మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదివారం నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గ అభివృద్ధికి రామ్‌లు ఎంతో కృషి చేశారని ఆయన పేర్కొన్నారు.

గుండంపల్లిలో..

మల్లాపూర్: మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రామ్‌లు సేవలు మరువలేనివని గుండంపల్లి కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు నానం రాజతిరుపతి అన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని గుండంపల్లిలో రామ్‌లు చిత్రపటానికి నివాళి అర్పించారు. మాజీ సర్పంచ్ మామిడి లక్ష్మారెడ్డి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ అంతడుపుల నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు మార్గం బుచ్చిరెడ్డి, లక్ష్మీనారాయణ, సురేశ్, మధు, క్రాంతి, నవీన్, మేకల శ్రీను, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి


విరాళం అందిస్తున్న మాజీ సర్పంచ్ రామారావు

బుగ్గారం: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గోపులాపూర్ మాజీ సర్పంచ్ బల్గూరి రామారావు అన్నారు. గోపులాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించనున్న అంబేడ్కర్ విగ్రహం కోసం తనవంతుగా రూ.50వేలు విరాళం అందించారు. జై భీమ్ యూత్, స్థానిక మాదిగ కుల సంఘం పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

మల్లాపూర్: ఇబ్రహీంపట్నం మండలంలోని తిమ్మాపూర్ తండాలో 12న నిర్వహించే అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర రమేశ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ‘చలో తిమ్మాపూర్ తండా’ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. యువజన సంఘం సీనియర్ నాయకులు ఎల్క కమలాకర్, పెద్దిరెడ్డి లక్ష్మణ్, బోడ ప్రశాంత్, చిట్యాల నవకాంత్, సిద్ద బాలరాజు, మేకల సతీశ్, జంగం దినేశ్, దళిత రాజు, మేతె రమేశ్, కడకుంట్ల వినయ్‌సాహు, మామిడి చిన్నగంగనర్సయ్య పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ విజయవంతం చేయండి


ఆహ్వానపత్రిక అందిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్ తండాలో 12న అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణను ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు చేస్తారని ఈ కార్యక్రమానికి బహుజనులంతా అధిక సంఖ్యలో పాల్గొనాలని అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు బట్టు శేఖర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని గ్రామాల్లో ఆహ్వాన పత్రికలు పంపిణీ చేశారు. సంఘం మండల ఉపాధ్యక్షుడు చిట్యాల వినోద్, వర్కింగ్ ప్రెసిడెంట్ తలారి ఆనంద్, బహుజన్ సమాజ్ పార్టీ కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి గుజ్జెరి ప్రకాష్, నాయకులు నడ్పి రాజన్న, తుక్కారం పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ప్లాట్‌ఫామ్‌లు నిర్మించాలి


పెగడపల్లిలో కిరాయి పరదలపై ఆరబోసిన ధాన్యం

పెగడపల్లి: ఐకేపీ(సెర్ప్), సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్లాట్‌ఫామ్‌లు నిర్మించాలని రైతులు కోరుతున్నారు. ప్లాట్‌ఫామ్‌లు లేకపోవడంతో ధాన్యం మట్టిలో కలిసి నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. పెగడపల్లి మండలంలో 18ఏళ్ల క్రితం నుంచి ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నా కేంద్రాలకు శాశ్వత స్థలాలు ఏర్పాటు చేసి ప్లాట్‌ఫామ్‌లు నిర్మించే దిశగా ప్రయత్నాలు చేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రతి ఏటా ఖరీఫ్, యాసంగి సమయాల్లో పెగడపల్లి, నంచర్ల, నందగిరి సహకార సంఘాలు, ఐకేపీ (సెర్ప్)ల ఆధ్వర్యంలో మండలంలోని అనేక గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. కేంద్రాల ఏర్పాటుతో రైతులకు ప్రయోజనం ఉన్నా.. అందులో వారికి కావాల్సిన వసతుల కల్పనలో అధికారులు విఫలమవుతున్నారని రైతులు చెప్తున్నారు. కేంద్రాల వద్ద సరిపడా టార్పాలిన్లు లేక తామే కిరాయికి తెచ్చుకుంటున్నామని, దీంతో కిరాయి పరదాలకు అద్దె తడిసి మోపడవుతోందని పేర్కొంటున్నారు. కేంద్రాల వద్ద ప్లాట్‌ఫామ్‌లు లేకపోవడంతో నేలపైనే ధాన్యం పోయాల్సి వస్తోంది. కొనుగోలు కేంద్రాలకు ఆయా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలను కేటాయించి ప్లాట్‌ఫామ్‌లు నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జగిత్యాల జిల్లా :
9951602934, 9000308905
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
జగిత్యాల : రాజమల్లేశ్ - 9392460005
ధర్మపురి : వెంకటేష్ - 8008019205
కోరుట్ల : సురేశ్ - 7997958210
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899